

మున్సిపాలిటీలో గ్రామాలను కలుపవద్దని మంత్రి శ్రీధర్‌బాబును కోరుతున్న మాజీ ఎంపీటీసీ వెంకటేష్

ఔటర్ వెలుపలి గ్రామాలను మున్సిపాలిటీలో కలపొద్దు

- మంత్రి శ్రీధర్‌బాబుకు మాజీ ఎంపీటీసీ వినతి

అబ్దుల్లాపూర్‌మెట్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ఔటర్ రింగు రోడ్డు వెలుపల ఉన్న తారామతిపేట, బాచారం గ్రామాలను మున్సిపాలిటీల్లో కలుపవద్దని కోరుతూ శుక్రవారం కొంగరకలాన్‌లో నిర్వహించిన కార్యక్రమానికి హాజరైన మంత్రి శ్రీధర్‌బాబుకు తారామతిపేట తాజా మాజీ ఎంపీటీసీ చేగూరి వెంకటేష్ వినతి పత్రం అందజేశారు. పల్లె వాతావరణంలోనే ఉన్న రెండు గ్రామాలను మున్సిపాలిటీలో విలీనం చేయొద్దని విజ్ఞప్తి చేశారు. ఔటర్ వెలుపల ఉన్న గ్రామాలను కూడా కలుపుతున్నట్లు పెద్ద ఎత్తున సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోందని తెలిపారు. ఈ విషయాన్ని స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి మంత్రికి వివరించినట్లు వెంకటేష్ తెలిపారు. మంత్రి కూడా సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న మేయర్ పారిజాతారెడ్డి

అన్నపూర్ణనగర్‌లో రోడ్డు పనులు ప్రారంభం

సరూర్‌నగర్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్ 20వ డివిజన్‌లోని అన్నపూర్ణనగర్‌కాలనీలో మునిసిపల్ సాధారణ నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను శుక్రవారం కార్పొరేటర్ పెద్దబావి సుదర్శన్‌రెడ్డితో కలిసి మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బడంగ్‌పేట్‌ను ఆదర్శవంతమైన కార్పొరేషన్‌గా మార్చడానికి చర్యలు తీసుకుంటున్నామని, అందుబాటులో ఉన్న నిధులతో దశలవారీగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ ఏఈఈ సాయిరామ్, కాలనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

శ్మశానవాటికను సద్వినియోగం చేసుకోవాలి

వనస్థలిపురం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): నాగోల్ శ్మశానవాటికను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని జీహెచ్‌ఎంసీ హయత్‌నగర్ సర్కిల్ ఉప కమిషనర్ తిప్పర్తి యాదయ్య అన్నారు. నాగోల్ శ్మశానవాటికలో అభివృద్ధి పనుల పేరుతో పురాతన సమాధులను ధ్వంసం చేస్తున్నారనీ, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా గతంలో ఉన్న విధంగానే శ్మశానవాటికను ఉంచాలని తెలంగాణ చేతి వృత్తిదారుల సమాఖ్య ప్రధాన కార్యదర్శి బొడ్డుపల్లి కృష్ణ జోనల్ కమిషనర్, ఉపకమిషనర్లతో పాటు ఇతర అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో డీసీ సంబంధిత అధికారులతో కలిసి శ్మశానవాటికను శుక్రవారం పరిశీలించారు. ఈసందర్భంగా డీసీ మాట్లాడుతూ శ్మశానవాటిక ఏ ఒక్క వర్గానికి కాకుండా అన్నివర్గాల ప్రజలు ఉపయోగించుకోవాలన్నారు. అధికారులు, సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదికకు స్పందన

వనస్థలిపురం: బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ ఎస్కేడినగర్ చౌరస్తాలోని వనస్థలిపురం సబ్‌డివిజన్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదికకు స్పందన లభించింది. ఈ మేరకు కాలనీవాసులు విద్యుత్ దీర్ఘకాలిక సమస్యలు, బిల్లులో హెచ్చుతగ్గులు తదితర విషయాలపై వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా సీ.జీ.ఆర్.ఎఫ్ చైర్‌పర్సన్ లలిత మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులు, సిబ్బంది ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. వినియోగదారుల సమస్యల పరిష్కారమే తమ ధ్యేయం అన్నారు. మెంబర్ ఆఫ్ ఫైనాన్స్ శోభారాణి, ఎస్.ఏ.ఓ రమణారెడ్డి, డీఈ సురేష్, ఏడీఓ రామచందర్, ఏఈలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

పిగ్లీపూర్‌లో చెరువు భూములను కాపాడండి

- తహసీల్దార్‌కు గ్రామస్థుల వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్థులు

అబ్దుల్లాపూర్‌మెట్: అబ్దుల్లాపూర్‌మెట్ మండలం పిగ్లీపూర్ గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 46లోని చెరువు ఎఫ్‌టీఎల్ భూములను అమ్మడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని గ్రామానికి చెందిన పలువురు తహసీల్దార్ రవీందర్‌దత్‌కు శుక్రవారం ఫిర్యాదు చేశారు. సర్వే నంబర్ 46లోని 22.11 ఎకరాలు కొందరు సీలింగ్ పట్టాలు పొంది అమ్మేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని తెలిపారు. అధికారులు పరిశీలించి సదరు భూమిని కాపాడాలని విజ్ఞప్తి చేశారు.

మలక్‌పేట సర్కిల్ కార్యాలయంలో బీఎల్‌ఓలకు శిక్షణ

- సోమవారం నుంచి ఓటర్ల ఇంటింటి సర్వే



బీఎల్‌ఓలకు శిక్షణ ఇస్తున్న ట్రైనర్ మనోహర్‌రెడ్డి

ఓల్డ్‌మలక్‌పేట, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు త్వరలో నిర్వహించనున్న ఇంటింట ఓటర్ల సర్వే పకడ్బందీగా చేపట్టాలని అసెంబ్లీ లెవల్ మాస్టర్ ట్రైనర్ మనోహర్‌రెడ్డి బీఎల్‌ఓలకు, సూపర్ వైజర్లకు సూచించారు. శుక్రవారం మలక్‌పేట సర్కిల్ కార్యాలయంలో బీఎల్‌ఓలకు, సూపర్ వైజర్లకు ఓటర్ లిస్టు సర్వేపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ సోమవారం నుంచి బీఎల్‌ఓలు ఇంటింటికీ తిరిగి ఓటర్ల సర్వే చేపట్టనున్నట్లు తెలిపారు. ఇంటి వద్దకు సిబ్బంది వచ్చినప్పుడు ప్రజలు సహకరించాలని కోరారు. కొత్త ఓటర్ల నమోదుతో పాటు లేని ఓటర్లను తొలగించడం, ఓటర్ లిస్టులో మార్పులు చేర్పులు చేసుకునే అవకాశం ఉందన్నారు. ఇంటింటి సర్వే అక్టోబర్ 18 వరకు కొనసాగుతుంది. అనంతరం అదే నెల 29న లిస్టు ప్రకటిస్తారు. నవంబర్ 28 వరకు ఫిర్యాదుల స్వీకరణ, 2025 జనవరి 6వ తేదీన తుది జాబితా ప్రకటిస్తామని తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమంలో ఏఈఆర్‌ఓలు జయశ్రీ, గజానంద్, అసదుద్దీన్, మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు.

సాయినగర్‌కాలనీలో పర్యటించిన కార్పొరేటర్



సాయినగర్‌కాలనీలో పేరుకుపోయిన చెత్తను పరిశీలిస్తున్న కార్పొరేటర్ జీవన్‌రెడ్డి

హయత్‌నగర్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): హయత్‌నగర్ డివిజన్‌లోని ఆయా ప్రాంతాల్లో పేరుకుపోయిన చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాలని కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి అధికారులను కోరారు. శుక్రవారం డివిజన్‌లోని సాయినగర్‌కాలనీ డంపింగ్‌యార్డు వద్ద పేరుకుపోయిన చెత్తను ఆయన రాంకీ సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సాయికాలనీలో కొన్ని రోజులుగా చెత్తను ఎత్తకపోవడంతో దుర్గంధవాసన వస్తోందని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు రోజు విడిచి రోజు చెత్తను తరలించాలని కోరారు. కార్యక్రమంలో రాంకీ సిబ్బంది రాము, శానిటేషన్ జవాన్ యాదయ్య, సూపర్‌వైజర్ యాదయ్య, కాలనీవాసులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ అంతరిక్ష దినోత్సవం

అబ్దుల్లాపూర్‌మెట్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కుత్బుల్లాపూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో నేషనల్ స్పేస్‌డే వేడుకలను శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఇస్రో శాస్త్రవేత్త టి.సంతోషి హాజరయ్యారు. ఈ సందర్భంగా వ్యోమగాములు, అంతరిక్ష ప్రయోగాలు, ఇస్రో రంగంలో సాధించిన ప్రగతిని విద్యార్థులకు వివరించారు. సౌర కుటుంబం నృత్య ప్రదర్శన నిర్వహించారు. అంతరిక్ష ప్రగతి అనే అంశంపై పోస్టర్ మేకింగ్ పోటీలను నిర్వహించారు. స్పేస్ క్విజ్ ను నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు ఇస్రో శాస్త్రవేత్త బహుమతుల ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జగదీష్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



పూర్వ విద్యార్థిని సత్కరిస్తున్న ఉప విద్యాశాఖాధికారి విజయలక్ష్మి

మలక్‌పేట ప్రభుత్వ పాఠశాలలో..

సైదాబాద్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): మలక్‌పేట ప్రభుత్వ పాఠశాలలో జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈసందర్భంగా భారతీయ అంతరిక్ష చరిత్ర యొక్క అద్భుతం అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. హిమాయత్‌నగర్ మండల ఉప విద్యాశాఖాధికారి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి మాట్లాడుతూ ఆగస్టు 23న చంద్రయాన్-3 విక్రమ్ ల్యాండర్ సేఫ్‌గా చంద్రుని దక్షిణ ధ్రువంలో ల్యాండ్ అయిన సందర్భంగా జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని నిర్వహిస్తారని తెలిపారు. అంతరిక్ష పరిశోధన, ప్రయోగాలపై విజయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు కార్యక్రమం నిర్వహించామని వివరించారు. గోల్డెన్ మెరిట్ అవార్డు అందుకున్న పాఠశాల పూర్వ విద్యార్థిని పూజను సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేస్తున్న శాస్త్రవేత్త సంతోషి

కారు పార్కింగ్ విషయంలో గొడవ

- అసభ్యకరంగా ప్రవర్తించారని పోలీసులకు ఫిర్యాదు చేసిన మహిళ
- డీసీపీ కార్యాలయానికి చేరుకున్న పంచాయితీ

అబ్దుల్లాపూర్‌మెట్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): కారు పార్కింగ్ విషయంలో మొదలైన గొడవ, పెరిగి పెద్దదై దాడులు చేసుకునే వరకు వెళ్లింది. తమపై దాడి చేశారని ఇరు వర్గాల వారు హయత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఇరు వర్గాలపై కేసులు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి.. పెద్దఅంబర్‌పేట్ సాయినగర్ కాలనీకి చెందిన సీతారెడ్డి చిన్న కుమారుడి వివాహం ఆదివారం జరిగింది. మంగళవారం ఆయన ఇంట్లో సత్యనారాయణ వ్రతం జరిగింది. అదే సమయంలో షేక్‌పేట ప్రాంతానికి చెందిన నవీన్ ఆయన భార్య కలిసి కారులో సీతారెడ్డి ఇంటి పక్కనే ఉన్న అమ్మమ్మ ఇంటికి వచ్చారు. సత్యనారాయణ వ్రతం జరుగుతుండడంతో బంధువులు వచ్చారు. వారి వాహనాలు సీతారెడ్డి ఇంటి ముందు పార్క్ చేశారు. వాహనాల పార్కింగ్ వద్ద ప్రారంభమైన గొడవ ఇరువర్గాల వారు దాడులు చేసుకునే వరకు చేరుకుంది. వాహనాల పార్కింగ్ గురించి ప్రశ్నించిన నవీన్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ సీతారెడ్డి గొంతుపట్టుకుని కొద్ది దూరం వరకు అతడిని నెట్టేసినట్లు తెలిసింది. ఇది గమనించిన ఆయన కుటుంబ సభ్యులు నవీన్‌ను పట్టుకుని తీవ్రంగా కొట్టారు. వారి దెబ్బలు తాళలేక నవీన్ అక్కడి నుంచి పారిపోయి 100కు ఫోన్ చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఇదిలా ఉండగా నవీన్ పారిపోవడంతో ఆగ్రహంతో ఉన్న సీతారెడ్డి కుటుంబ సభ్యులు, నవీన్ కారును ధ్వంసం చేశారు. ఈ సమయంలో సీతారెడ్డి కుటుంబ సభ్యులు తనపై దాడికి పాల్పడ్డారని నవీన్ భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. అమ్మమ్మ ఇంట్లో ఉన్న తనను బయటకు లాక్కొచ్చి, చేతులు కట్టివేసి దూషించారని తెలిపింది, తనను పందిరికి కట్టివేశారని, దాడిలో పాల్గొన్న సీతారెడ్డి కుటుంబ సభ్యులు తనను అసభ్యకరంగా తాకారని, బూతులు తిట్టారని తెలిపింది. అడ్డుకునేందుకు వచ్చిన కుటుంబ సభ్యులపైనా దాడికి పాల్పడ్డారని, కారును ధ్వంసంచేసి, అందులో ఉన్న రూ. 1.30 లక్షలు దోచుకున్నారని, నవీన్ మెడలో ఉన్న 8 తులాల బంగారు గొలుసు కూడా లాక్కున్నారని ఫిర్యాదులో పేర్కొంది. తనను పందిరికి కట్టేసిన సమయంలో స్థానిక నాయకుడు చూసి పోలీసులు వస్తున్నారు.. వదిలిపెట్టండని చెప్పడంతో వదిలేసినట్లు ఫిర్యాదులో పేర్కొంది. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు సీతారెడ్డి కుటుంబ సభ్యులపై సెక్షన్ 323, 341, 504, 506, 509 కేసు నమోదు చేశారు. పార్కింగ్ విషయంలో దూషించడంతో పాటు కారును వేగంగా నడిపి పలువురికి గాయాలయ్యేలా చేశాడన్న ఫిర్యాదుపై నవీన్‌పై 324, 323, 506 సెక్షన్‌ల కింద కేసు నమోదు చేశారు. ఇరు పక్షాలపై కేసులు నమోదు కావడంతో శుక్రవారం ఉదయం ఇరు వర్గాలకు చెందిన వారు హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్ వద్ద ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. దీంతో సీఐ రామకృష్ణ కల్పించుకుని ఇరు వర్గాలను ఎల్‌బీనగర్ డీసీపీ కార్యాలయానికి పంపించారు. నవీన్ భార్యను కట్టేసి కొట్టిన విషయంపై హయత్‌నగర్ సీఐ రామకృష్ణను వివరణ కోరగా అలాంటిదేమి జరగలేదని తెలిపారు. ఇద్దరు ఎస్‌ఐలు స్థానికులను అడిగి వివరాలు సేకరించారని తెలిపారు.



నవీన్ కారు ఢీకొని గాయపడిన మహిళ



నవీన్‌ను చితకబాదుతున్న సీతారెడ్డి కుటుంబ సభ్యులు

సీతారెడ్డి కుటుంబ సభ్యుల ఆరోపణ..

శుభకార్యం పనుల్లో ఉన్న తమను అనవసరంగా దూషించి దాడి చేసి నవీన్ గొడవకు దిగాడని సీతారెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కారును వేగంగా వెనక్కు ముందుకు తీస్తూ భయభ్రాంతులకు గురి చేశాడని సీతారెడ్డి ఆరోపించారు. ఈ క్రమంలో తమ కుటుంబానికి చెందిన నలుగురికి గాయాలు అయినట్లు సీతారెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. గొడవలో తమకు చెందిన 5 తులాల బంగారం పోయిందని ఫిర్యాదులో వివరించారు.

తుర్కయంజాల్ మున్సిపాలిటీ లక్ష్మి మెగాటౌన్‌షిప్‌లో నివాసం ఉంటున్న బీజేపీ సీనియర్ నాయకుడు కరుణాకర్ ఇంటికి శుక్రవారం త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి వచ్చారు. రాగన్నగూడలో ఓ వివాహ వేడుకకు హాజరైన ఇంద్రసేనారెడ్డి దంపతులు పార్టీలో సహచరుడిగా పని చేసిన కరుణాకర్ ఇంటికి వెళ్లి మంచిచెడులను అడిగితెలుసుకున్నారు. ఈ స్థానిక బీజేపీ నాయకులు బచ్చిగళ్ల రమేష్, పురుషోత్తం, నర్సింహగౌడ్, శ్రావణ్‌గౌడ్ తదితరులు వెంట ఉన్నారు. - హయత్‌నగర్, ఆంధ్రజ్యోతి



హయత్‌నగర్ కోర్టును సందర్శించిన ఆర్‌అండ్‌బీ అధికారులు

హయత్‌నగర్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ హైకోర్టు బిల్డింగ్ కమిటీ ఆదేశాల మేరకు శుక్రవారం హయత్‌నగర్ కోర్టును రోడ్డు భవనాల శాఖ అధికారులు సందర్శించారు. హయత్‌నగర్ కోర్టులో మరో రెండు తాత్కాలిక కోర్టుల భవనాలను నిర్మించేందుకు అంచనా వేయడానికి అధికారులు వచ్చారు. ఏఈ మధుసూదన్, ఇంజనీర్ సురేందర్‌రెడ్డి, భవన నిర్మాణానికి కావాల్సిన స్థలాన్ని పరిశీలించారు. రెండు మూడు రోజుల్లో ప్రతిపాదనలు సిద్ధం చేసి హైకోర్టుకు అందజేస్తామని తెలిపారు. నెల రోజుల్లోగా కొత్త భవనాలను ప్రారంభించే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో సివిల్ జడ్జి సల్మాఫాతిమా, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బొడ్డు భిక్షపతిగౌడ్, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి సాకేత మిత్రాతో పాటు పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.



స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్‌అండ్‌బీ అధికారులు

నేడు ఆలయంలో ఆంజనేయ తత్వంపై ప్రవచనాలు

చంపాపేట, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లోని హనుమాన్ ఆలయంలో శనివారం ఉదయం 9:40గంటలకు ఆంజనేయ తత్వంపై ప్రవచన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. శత దేవాలయ ప్రవచన యాత్రలో భాగంగా నైమిషారణ్య పీఠం అధిపతి బాల బ్రహ్మానంద సరస్వతి ఆలయంలో ధ్యానాంజనేయస్వామి సన్నిధిలో పూజలు నిర్వహించనున్నారు. అనంతరం ఆయన భక్తులకు ప్రవచనం వినిపించనున్నట్లు ఆలయ ఈఓ లావణ్య తెలిపారు.



అష్టలక్ష్మి ఆలయంలో బారులు తీరిన భక్తులు

శ్రావణ శుక్రవారం.. భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు

ఎల్‌బీనగర్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసం మూడో శుక్రవారం సందర్భంగా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. అమ్మవార్లను దర్శించుకునేందుకు భక్తులు ఆలయాలకు బారులు తీరారు. అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. మహిళలు పెద్దఎత్తున ఆలయాలకు చేరుకుని సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించారు. కొత్తపేటలోని అష్టలక్ష్మి ఆలయంలో ఉదయం ఆదిలక్ష్మి సమేత శ్రీమన్నారాయణస్వామికి అభిషేకం నిర్వహించారు. అనంతరం అష్టలక్ష్మీలకు లక్ష పుష్పార్చన చేశారు. సాయంత్రం లక్ష్మీనారాయణస్వామి కల్యాణ మహోత్సవం కనుల పండువగా నిర్వహించారు.

ఖానాపూర్ దళిత రైతులకు ప్రభుత్వం న్యాయం చేయాలి

- భూస్వాముల కబ్జాపర్వాన్ని అడ్డుకోవాలి
- బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి ఇబ్రాం శేఖర్ డిమాండ్

సరూర్‌నగర్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలంలోని ఖానాపూర్ గ్రామానికి చెందిన దళిత రైతులకు ప్రభుత్వం తగిన న్యాయం చేయాలని, అక్కడి భూస్వాములు దళితుల భూములను కబ్జాచేయడాన్ని అడ్డుకోవాలని బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి, బడంగ్‌పేట్ డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్ డిమాండ్ చేశారు. ఖానాపూర్‌లోని సర్వే నంబర్లు 16,18,20లలో దశాబ్దాలుగా సాగు చేసుకుని జీవనం వెళ్లదీస్తున్న పలు దళిత కుటుంబాలకు చెందిన రైతులు శుక్రవారం శేఖర్‌ను బడంగ్‌పేట్‌లోని మునిసిపల్ కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. తమ భూములను స్థానిక అగ్రవర్ణ భూస్వాములు కొందరు అక్రమంగా పట్టా చేయించుకుని, ఇతరులకు విక్రయించారని, దాంతో తమ జీవనాధారం దూరమైందని ఈ సందర్భంగా వారు శేఖర్‌కు వివరించారు. అనంతరం శేఖర్ మాట్లాడుతూ ఖానాపూర్‌లో భూస్వాముల ఆగడాలపై బీఎస్పీ తరపున పోరాటం చేస్తామని, స్థానిక దళిత రైతుల భూములు తిరిగి వారికే దక్కేదాకా ఉద్యమం కొనసాగిస్తామని పేర్కొన్నారు. దళితులు సాగుచేసుకుంటున్న ప్రభుత్వ భూములకు పట్టాదారు పాసు బుక్కులు జారీ చేసిన రెవెన్యూ అధికారులపై వెంటనే శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని, ఆ భూముల క్రయవిక్రయాలను నిలిపివేయాలని ఆయన డిమాండ్ చేశారు. స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఈ విషయంలో జోక్యం చేసుకుని దళిత రైతులను ఆదుకోవాలని ఆయన కోరారు. ఈ భూముల విషయంలో ప్రభుత్వం, అధికారులు తగిన విధంగా స్పందించకపోతే ఎస్సీ, ఎస్టీ రైతులను, కుల సంఘాలను కలుపుకుని బీఎస్పీ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళన చేపడతామని శేఖర్ హెచ్చరించారు.



శేఖర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఖానాపూర్ దళిత రైతులు

మట్టి దిబ్బను బైక్ ఢీకొని యువకుడి మృతి

హయత్‌నగర్: బైక్‌పై వెళ్తున్న యువకుడు ప్రమాదవశాత్తు రోడ్డుపై మట్టి కుప్పను ఢీకొని మృతిచెందిన సంఘటన గురువారం అర్ధరాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రి భువనగిరి జిల్లా దండు మల్కాపురానికి చెందిన సిల్వేరు మహేష్(27) నగరంలోని ఓ ప్రైవేటు ఫైనాన్స్ సంస్థలో పని చేస్తున్నాడు. గురువారం అర్ధరాత్రి విధులు ముగించుకుని బైక్‌పై ఇంటికి వెళ్తున్నాడు. పెద్ద అంబర్‌పేట్ లక్ష్మారెడ్డిపాలెం వద్ద రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా ఓ చోట మట్టి కుప్ప ఉంది. అది గమనించని మహేష్ దాన్ని ఢీకొని కింద పడ్డాడు. తీవ్ర గాయాలకు గురైన అతడిని ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కారు ఢీకొని మహిళ..

కుషాయిగూడ జమ్మిగడ్డలోని నెహ్రూనగర్‌కు చెందిన నాగహరిశెట్టి పాండురంగారావు, విజయలక్ష్మి దంపతులు, కుమారుడు అంజనేయులు విజయవాడలో బంధువు చనిపోవడంతో అంత్యక్రియలకు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో వారు కారులో వచ్చి గురువారం రాత్రి పెద్దఅంబర్‌పేట్ ఓఆర్ఆర్ వద్ద దిగారు. మరో వాహనాన్ని ఎక్కేందుకు రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తుండగా వారిని వెనుక నుంచి వేగంగా వచ్చిన కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో విజయలక్ష్మి తీవ్ర గాయాలకు గురైంది. వెంటనే ఆమెను వనస్థలిపురంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆమె మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఆమె భర్త పాండురంగారావుకు, కుమారుడు అంజనేయులకు గాయాలయ్యాయి. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గణేశ్ ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి

- సౌత్ ఈస్ట్ జోన్ డీసీపీ కాంతిలాల్ పాటిల్ సుభాష్

సైదాబాద్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): గణేశ్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవడంలో అన్ని విభాగాల అధికారులు తమ వంతు సహకారాన్ని అందించాలని సౌత్ ఈస్ట్ జోన్ డీసీపీ కాంతిలాల్ పాటిల్ సుభాష్ అన్నారు. శుక్రవారం సైదాబాద్ పోలీస్‌స్టేషన్ హాల్‌లో జీహెచ్‌ఎంసీ, విద్యుత్, ఆర్‌అండ్‌బీ, రెవెన్యూ, జలమండలి, ఆర్టీసీ, ఆర్టీఏ అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. డీసీపీ మాట్లాడుతూ గణేశ్ నవరాత్రి ఉత్సవాల ముందుగానే రోడ్ల మరమ్మతులు, చెట్లకొమ్మల తొలగింపు, వేలాడుతున్న కేబుల్ వైర్లను సరిచేయడం వంటి పనులు పూర్తి చేయాలని కోరారు. ఉత్సవాల నిర్వహణకు నగర పోలీస్ కమిషనర్ సీపీ విధించిన నియమ నిబంధనలను తప్పనిసరిగా పాటించి శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. సమస్యలపై ఫిర్యాదులు అందిన వెంటనే స్పందించి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో వివిధ శాఖల సిబ్బందితో పాటు, ఎస్‌బీ, ఇంటలిజెన్స్ అధికారులు, అదనపు డీసీపీ స్వామి, సైదాబాద్, సంతోష్‌నగర్, మలక్‌పేట, చంద్రాయణగుట్ట ఏసీపీలు, జోన్ పరిధిలోని ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీసీపీ కాంతిలాల్ పాటిల్

పోలీస్ నిబంధనలు పాటించాలి : ఇన్‌స్పెక్టర్

సంతోష్‌నగర్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): గణేశ్ మండప నిర్వాహకులు పోలీసుల నిబంధనలు కచ్చితంగా పాటించి శాంతి భద్రతలకు సహకరించాలని ఐఎస్‌సదన్ ఇన్‌స్పెక్టర్ ఎం. వెంకటరామయ్య అన్నారు. శుక్రవారం గణేశ్ మండప నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. వినాయక చవితి ఉత్సవాలను ఆనందోత్సవాల మధ్య జరుపుకోవాలన్నారు. నగర పోలీస్ కమిషనర్ నిర్దేశించిన రూల్స్‌ను తప్పనిసరిగా పాటించాలన్నారు. ఉత్సవ సమితి నిర్వాహకులు వలంటీర్లను ఏర్పాటు చేసుకొని నిమజ్జనం పూర్తి అయ్యే వరకు అందుబాటులో ఉండాలన్నారు. వారి పేర్లు పోలీస్ బుక్‌లో నమోదు చేసుకోవాలన్నారు. సున్నితమైన ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఉంటుందన్నారు. అనుమానిత వ్యక్తులు కానీ, వస్తువులు కానీ కనిపిస్తే వెంటనే స్థానిక పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో అదనపు ఇన్‌స్పెక్టర్, సైదయ్య, ఎస్‌ఐలు బ్రహ్మాచారి, విజయ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ వెంకటరామయ్య

గంజాయి తరలిస్తున్న అంతర్రాష్ట్ర ముఠా అరెస్ట్

- 60 కిలోల సరుకు స్వాధీనం

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : గంజాయి తరలిస్తున్న అంతర్రాష్ట్ర ముఠాను మహేశ్వరం ఎస్‌ఓటీ, యాచారం పోలీసులు కలిసి అరెస్ట్ చేశారు. అరకు నుంచి బెంగళూరుకు గంజాయి తరలిస్తున్న అరకు ప్రాంతానికి చెందిన కొర్ర బాబూరావు (25), బురుండి కోమేశ్వర్ (33)లను అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ. 25 లక్షల విలువైన 60 కిలోల గంజాయి, 2 మొబైల్ ఫోన్లు, మారుతి బ్రెజా కారు స్వాధీనం చేసుకున్నారు.



స్వాధీనం చేసుకున్న గంజాయితో పోలీసులు

టీపీసీసీ సేవాదళ్ చైర్మన్‌కు ఘన సన్మానం

చంపాపేట, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ సేవాదళ్ చైర్మన్ మిద్దెల జితేందర్ బాధ్యతలు చేపట్టి ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా గాంధీభవన్‌లో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో చంపాపేటకు చెందిన టీపీసీ సేవాదళ్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ మెట్టు వెంకట్‌రెడ్డి ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిద్దెల జితేందర్ భవిష్యత్‌లో మరిన్ని ఉన్నత పదవులు చేపట్టాలని ఆయన ఆకాంక్షించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సంతోష్‌నగర్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): టీఎస్ఎస్‌పీడీసీఎల్ సరూర్‌నగర్ డివిజన్ పరిధిలోని 11కేవీ శారదనగర్, శివాలయం, లక్ష్మీగణపతి, రాఘవేంద్రకాలనీ, వాంబేకాలనీ, ఆర్‌కేపురం, గ్రీన్‌హిల్స్, వెంకటరమణకాలనీ, పెద్దఅంబర్‌పేట్, హయత్‌నగర్, విగార్డ్, విశాలాంధ్ర, శివపార్వతి, గంగహాస్పటల్, యాదనగర్, పెద్దఅంబర్‌పేట్, హైకోర్టుకాలనీ, ఆటోనగర్ ఫీడర్ల పరిధిలోని ప్రాంతాల్లో చెట్లు కొట్టివేత, నిర్వహణపనుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని డీఈ తెలిపారు. 11కేవీ శారదనగర్, శివాలయం, లక్ష్మీగణపతి, రాఘవేంద్రకాలనీ, వాంబేకాలనీ ఫీడర్ల పరిధిలోని ప్రాంతాల్లో ఉదయం 10గంటల నుంచి 11.30గంటల వరకు, 11కేవీ ఆర్‌కేపురం, గ్రీన్‌హిల్స్, వెంకటరమణకాలనీ, పెద్దఅంబర్‌పేట్, హయత్‌నగర్, విగార్ ఫీడర్ల పరిధిలోని ప్రాంతాల్లో ఉదయం 11.30గంటల నుంచి మధ్యాహ్నం1గంటల వరకు, 11కేవీ విశాలాంధ్ర, శివపార్వతి ఫీడర్ల పరిధిలోని ప్రాంతాల్లో మధ్యాహ్నం 1.30గంటల నుంచి 3గంటల వరకు, 11కేవీ గంగహాస్పటల్ ఫీడర్ పరిధిలోని ప్రాంతాల్లో మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 3గంటల వరకు, 11కేవీ యాదనగర్, పెద్దఅంబర్‌పేట్, హైకోర్టుకాలనీ, ఆటోనగర్ ఫీడర్ల పరిధిలోని ప్రాంతాల్లో 3గంటల నుంచి సాయంత్రం 4.30గంటల వరకు విద్యుత్‌సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆయన తెలిపారు.